క్లుప్తంగా

శ్రీశైలం తరలిన శివ మాలధారులు



అమరచింత: మహాశివరాత్రిని పురస్కరించుకుని శివ మాలధారులు గ్రామాల్లో శివ మహాపడిపూజ అనంతరం పాదయాత్రగా శ్రీశైలం క్షేత్రానికి తరలివెళ్తున్నారు. మక్తల్, నర్వ మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన శివ మాలధారులు అమరచింత మీదుగా అల్లీపురం, కొత్తకోట మీదుగా పాదయాత్రగా బయలుదేరారు.

మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులు



పాన్‌గల్: ప్రభుత్వం 2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగులు ఇస్తున్న నేపథ్యంలో మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించినట్లు ఎంఈఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. నూతనంగా మండలానికి కేటాయించిన ఉపాధ్యాయులు నియామకపు ఉత్తర్వులను ఎంఈఓ కార్యాలయంలో అందజేయగా.. వారిలో శ్రీలతను దావాత్‌ఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు, వెంకటయ్యను యూపీఎస్ జమ్మాపూర్ పాఠశాలకు కేటాయించినట్లు ఎంఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరాశేఖరాచారి, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కాల్వలో జమ్ము తొలగించాలి



వీపనగండ్ల: మండలంలోని కేఎల్ఐ భీమా కాల్వలో ఏపుగా పెరిగిన జమ్ము తొలగించాలని కోరుతూ ప్రియదర్శిని పీజీపీ ఎస్ఈ పీకి సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ వినతిపత్రం అందజేశారు. కల్వరాల గ్రామంతో పాటు సమీప గ్రామాల్లోని కేఎల్ఐ భీమా జూరాల కాల్వలో జమ్ము ఏపుగా పెరగడంతో రైతుల పంట పొలాలకు సకాలంలో సాగునీరు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి జమ్మును తొలగించే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం



కొత్తకోట: పట్టణంలో శివ మాలధారుల సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ నిత్యాన్నదానానికి కొత్తకోట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపయ్యగారి కృష్ణారెడ్డి రూ.15 వేలు విరాళంగా శివ మాలధారులకు సోమవారం అందించారు. కార్యక్రమంలో గురుస్వాములు శాంతిరెడ్డి, శ్రీనివాస్, నాగన్న, ఆశన్న, నరసింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాగరాజు, శివ మాలధారులు పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలం'



వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణాకు అన్యాయం జరిగిందని.. ఈ బడ్జెట్ బడాబాబులు, కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మికులు, కర్షకులకు వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి ఆరోపించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో కార్మిక ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల జిల్లా సదస్సు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధరలను చట్టబద్ధం చేసే ఎంఎస్‌పీ చట్టం తెచ్చేది లేదని, అందుకు అవసరమైన నిధులు కేటాయించబోమని పార్లమెంట్‌లో స్పష్టం చేశారన్నారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా 1న మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కార్యదర్శి పరమేశ్వరాచారి, మేకల ఆంజనేయులు, బొబ్బిలి నిక్సన్, ఆర్.రమేష్, బుచ్చమ్మ, రాములు, మధు, పుష్ప, కురుమయ్య, శ్రీను, రాధ, లాలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఆందోళన చెందొద్దు'



చిన్నంబావి కస్తూర్బా పాఠశాలలో మాట్లాడుతున్న మానసిక వైద్యురాలు పుష్పలత

చిన్నంబావి: విద్యార్థులు వార్షిక పరీక్షలపై ఎలాంటి ఆందోళన చెందొద్దని మానసిక వైద్య నిపుణురాలు పుష్పలత అన్నారు. ఆమె మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విదార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుదూ పరీక్షల్లో సాధించాల్సిన లక్ష్యాలు, తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూ సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మానసికంగా ఒత్తిడిని తగ్గించేందుకు యోగా సాధన, ధ్యానం, ఆటలకు కొంత సమయం కేటాయించాలన్నారు. సంవత్సరం మొత్తం చదివిన సిలబస్‌ను గుర్తుచేసుకుంటూ.. కఠినంగా ఉన్న అంశాలపై ఎక్కువ ఏకాగ్రత పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారి రాజశేఖర్, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మహేశ్వరాచారి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో సోమవారం పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను అధికారులు పరిశీలించారు. ఎంఈఓ జయశంకర్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు కాళీదాస్, మునావత్ సుల్తానా సమక్షంలో వెరిఫికేషన్ టీమ్ సభ్యులు ఎంఎస్ విజయ్ కుమార్, కృష్ణమోహన్, రామకృష్ణ, వెంకటేశ్వర్‌గౌడ్, శ్రీనివాసులు, వెంకటయ్య పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఉపాధ్యాయులు చెప్పిన పాఠాల్లోని అంశాలను గుర్తించాలన్నారు. విద్యార్థులందరూ మంచి మార్కులతో 100 శాతం ఉత్తీర్ణత, జిల్లాలో ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు.



ఖిల్లాఘనపురంలో..

నైపుణ్యాలను వెలికితీయడమే క్రీడల లక్ష్యం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న విశ్వేశ్వర్

కొత్తకోట: యువతలోని నైపుణ్యాలను వెలికితీయడానికి క్రీడలు ఉపయోగకరంగా ఉంటాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పోగాకు విశ్వేశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలో నాలుగు రోజులుగా కేపీఎల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలను సోమవారం ఆయన టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. స్నేహభావంతో క్రీడాకారులు ఆటలు స్వీకరించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరిగే క్రీడా పోటీల వల్ల యువత నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. చదువులో రాణించలేని వారు కూడా క్రీడల్లో ప్రతిభ చూపి ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. కార్యక్రమంలో కేపీఎల్ నిర్వాహకులు నవీన్‌కుమార్‌రెడ్డి, గుంత శివ, బాలకృష్ణారెడ్డి, రఘు, కార్తీక్, సాయి, సన్నీ, మహేష్, శివశంకర్, తరుణ్, గణేష్, అరుణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

వనపర్తి రూరల్: గ్రామ ప్రంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సోమవారం తెలంగాణ ప్రతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు ఏదుట్ల కురుమయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం వారు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ సమస్యను వేగంగా పరిష్కరిస్తామని కార్మికులకు హామీనిచ్చారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు 2 నుంచి 6 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా కార్మికులు ముందు వరుసలో ఉండి కార్యక్రమాల్ని విజయవంతం చేస్తారని, కానీ ప్రభుత్వం వారిపై నిర్లక్ష్యం వహిస్తుందని వాపోయారు. కార్యక్రమంలో గట్టమ్మ, రాజు, రామచంద్రయ్య, నాయకులు నరేష్, కురుమయ్య, పెంటయ్య, నాగమ్మ, రాములు, పద్మ, రామకృష్ణ, దర్గమ్మ, రాజ్‌కుమార్ ఉన్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాన్‌గల్: జీపీలకు సంబంధించి గతేడాది ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులు, జీపీల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ రఘురాములకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. జీపీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కావాల్సిన ట్రాక్టర్‌కు డీజిల్, మరమ్మతు, బ్లీచింగ్, బయోటెక్స్, ఇతర పారిశుద్ధ్య సామాగ్రి, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణ వంటి ఖర్చులను అప్పులు తెచ్చి చెల్లిస్తున్నామన్నారు. గతేడాది ఆగస్టు నుంచి నిధులు విడుదల కాకుండా పెండింగ్‌లో ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. జీపీల నిర్వహణకు అవసరం ఉన్న నిధులను నేరుగా టీఎస్ బీపాస్ ఖాతాకు విడుదల చేయాలని, జీపీ సాధారణ నిధులు ట్రెజరీకి అనుసంధానం లేకుండా నేరుగా చెల్లింపులు జరుపుటకు అవకాశం కల్పించాలని లేనిచో మార్చి నుంచి జీపీల నిర్వహణ చేయడం కష్టమని వినతిపత్రంలో పేర్కొన్నట్లు వారు తెలిపారు.

'రైతు నేస్తం'లో పాల్గొనండి

వీపనగండ్ల: రైతుల ప్రయోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించే ఈ కార్యక్రమంలో రైతులకు ఉపయోగపడే యాంత్రీకరణ అనే అంశంపై అవగాహన కల్పిస్తారని, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

వివాహిత అదృశ్యం



కొత్తకోట రూరల్: మండలంలోని వడ్డెవాటకు చెందిన మడ్డెం చెన్నమ్మ ఈ నెల 14 నుంచి కనిపించట్లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ ఆనంద్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని వడ్డెవాటకు చెందిన ప్రసాద్‌కు 13ఏళ్ల క్రితం బిజినేపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన చెన్నమ్మతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. మడ్డెం ప్రసాద్ వృత్తిరీత్యా డ్రైవర్ కావడంతో కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఈనెల 13న భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్ నుంచి వడ్డెవాటకు వచ్చిన ప్రసాద్ 14న ఉదయం కొత్తకోటలోని బ్యాంకులో పని ఉందని ప్రసాద్ వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి రావడంతో చెన్నమ్మ కనిపించకపోగా ఆందోళన చెంది అత్తారింటికి ఫోన్ చేసి అడిగినా, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

వనపర్తి రూరల్: మండలంలోని నాచహల్లి సబ్‌స్టేషన్‌లో 3.15 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు లోడ్ బదిలీ చేస్తుండడంతో మంగళవారం ఉదయం 8.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నాచహళ్లి, పెద్దగూడెం, పెద్దగూడెంతండా, కిష్టగిరి, సవాయిగూడెం గ్రామాలకు వ్యవసాయ, గృహ, వ్యాపార, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



అమరచింత బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం బీఆర్ఎస్ నాయకులు జిల్లావ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో కేసీఆర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధాశ్రమాలు, ఆస్పత్రులు, పాఠశాలల్లో పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.

- కొత్తకోట చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు కేక్‌ను కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని, టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొగాకు విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, గుంత మౌనిక, చెన్నకేశవరెడ్డి, కొండారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- పాన్‌గల్‌లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వెంకటయ్యనాయుడు, హలీం, బాలస్వామియాదవ్, భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌లాల్, రమష్‌నాయక్, నిరంజన్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- ఖిల్లాఘనపురం బస్టాండు వద్ద మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సామ్యనాయక్, వెంకటరమణ, సత్యం, పెద్ద అంజనేయులుగౌడు పాల్గొన్నారు.
- చిన్నంబావి ప్రధాన చౌరస్తాలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకట్రమణమ్మ, తగరం లక్ష్మి, కురుమయ్య, డేగ శేఖర్, తిరుపాలు, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.
- అమరచింతలో మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్ ఇంటి ఆవరణంలో నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మంగమ్మ, ఎస్ఏ రాజు, నరసింహులు గౌడ్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.
- ఆత్మకూర్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాయత్రి, శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీను, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- వీపనగండ్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముంత మల్లయ్యయాదవ్, సత్యనారాయణగౌడ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.
- ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కటింగ్ చేశారు.

'లబ్ధిదారులు పనులు ప్రారంభించాలి'



ఇందిరమ్మ ఇంటి నమునాను పరిశీలిస్తున్న ఎండీ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ గంగ్వార్

కొత్తకోట రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. సోమవారం మండలంలోని రామనాథపురంలో వారు పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం రామనాథపురం గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి మొదటి విడతలో 69 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు గ్రామాన్ని సందర్శించినట్లు వారు తెలిపారు. అనంతరం పంచాయతీ భవనంలో లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండి మాట్లాడుతూ.. నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇళ్ల డబ్బులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తామన్నారు. ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల్లో చేపట్టాలని సూచించారు. దళారులకు ఆశ్రయించి డబ్బులు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ సీఈ చైతన్య, ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, పీడీసీ సంగప్ప, డీఈ విటోబా, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ చెన్నమ్మ తదితరులు ఉన్నారు.

తప్పిన పెను ప్రమాదం



కొమ్మ పడి ధ్వంసమైన కారు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ సమీపంలో, ఐబీ అతిథి గృహం ఎదుట మొడువారిన ఓ వేపచెట్టు సోమవారం సాయంత్రం ఆకస్మాత్తుగా విరిగి అక్కడే ఉన్న కారుపై పడటంతో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో కారు టాప్, ముందరి అద్దాలు, పరికరాలు పూర్తిగా పగిలిపోవడంతో పాటు పక్కనే ఉన్న బైక్ సైతం ధ్వంసమైంది. మొదువాడిన చెట్టు విరిగిపడే సమయంలో కారులో, చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని, తమకు న్యాయం చేయాలని కారు, బైక్ యజమానులు మున్సిపల్ కమిషనర్, పుర అధికారుల వద్ద వాగ్వివాదానికి దిగారు. ప్రకృతి విపత్తుకు తమకేమి సంబంధం ఉంటుందని అధికారులు బదులివ్వడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. మోదువాడిన చెట్టు నేల కొరిగిన దారిలో విద్యుత్ తీగలకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని మున్సిపల్ అధికారులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ కృష్ణ, అధికారులు

పాన్‌గల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వనపర్తి సీఐ కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రూరల్ అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన, హెల్ప్‌లైన్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని, ఆ వయస్సు కన్నా తక్కువ ఉన్న వారికి వివాహాలు చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించకపోయిన, అమ్మాయిలను మానసికంగా వేధించిన, మానవ అక్రమ రవాణా చేసినా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, 112, పోలీస్ 100కు సమాచారం అందించాలన్నారు. 2006 బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం బాల్య వివాహాలు జరిగితే శిక్ష అర్హులవుతారని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌కుమార్, ఆర్ఐ తిరుపతయ్య, హెచ్‌సీ యాదగిరి, సొసైటీ ప్రతినిధి రాజశేఖర్ పాల్గొన్నారు.

క్వారీ లీజు అనుమతులు రద్దు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మిరాసిపల్లి గ్రామస్తులు

కొత్తకోట రూరల్: గ్రామ సమీపంలో గల క్వారీ వల్ల ఇళ్లు పూర్తిగా దెబ్బతినడంతో పాటు పంటలు నాశనం అవుతున్నాయని మండలంలోని మిరాసిపల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి 44 పక్కన గల నివాస గృహాల సమీపంలో 2012–13లో అప్పటి అధికారులు క్వారీ కోసం అనుమతులు ఇచ్చారు. క్వారీలో పేలుళ్ల వల్ల ఇళ్లు పగుళ్లు వచ్చి పూర్తిగా శిథిలావస్థలోకి వచ్చాయని, అంతే కాకుండా శబ్దాలకు చిన్నపిల్లలు, వృద్ధులు వినికిడి సంబంధిత సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. తమ కష్టాలను జిల్లా పునర్విభజనకు ముందు ఉమ్మడి మహబూబ్‌నగర్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో.. వారి ఆదేశాల మేరకు తహసీల్దార్ క్వారీని మూసివేశారన్నారు. మళ్లీ లీజు పేరుతో క్వారీ పనులు ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తున్నారని, క్వారీ పనులు జరిగితే తమ ఇళ్లు పూర్తిగా పడిపోతాయని, వెంటనే అనుమతులు రద్దు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. క్వారీ నడిపించినట్లయితే క్వారీ సమీపంలో గల ఇళ్ల వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పి.వెంకట్రాములు, కృపాకర్, రాములు, పి.రాములు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ శశిధర్



పన్నుల సవరణ దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ శశిధర్

ఆత్మకూర్: పట్టణంలోని రోడ్డుపై వ్యాపారులు అక్రమణలను వారం రోజుల్లోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ చికినె శశిధర్ అన్నారు. సోమవారం వార్డు అధికారులు, పురసిబ్బందితో కలిసి స్థానిక వ్యాపారులకు నోటీసులు అందజేశారు. అమరచింత, కొత్తకోట, బస్టాండ్ వైపు రోడ్లపై ఉన్న షాపుల యజమానులు డ్రెయినేజీలపై మెట్లు, ర్యాంపులు, కంపౌండ్‌ను ఏర్పాటు చేసుకోవడంతో పాటు సామన్లు ఉంచుతున్నారని మండిపడ్డారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పన్నులు చెల్లించండి

పట్టణ అభివృద్ధికి సకాలంలో పన్నులు చెల్లించి ప్రజలు సహకరించాలని కమిషనర్ అన్నారు. పన్నుల విధింపులో తప్పులు ఉంటే స్థానిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే మరోమారు సవిరిస్తామని తెలిపారు. అనంతరం వార్డు అధికారులు, పురసిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్నులు చెల్లించాలని కోరారు. పట్టణంలో 5,432 నివాసాలు, దుకాణ సముదాయాలు ఉన్నాయన్నారు. పన్నులకు సంబంధించి రూ.2.38 కోట్లకు గాను రూ.92 లక్షలు మాత్రమే వసూలయ్యాయని ఇంకా 1.45 కోట్లు బకాయిలు పేరుకుపోయాయని పన్నులు చెల్లించడంలో చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు

వ్యాపార సముదాయాల్లో ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. ఈసందర్భంగా దుకాణ సముదాయాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టి రూ.రెండు వేల చొప్పున నలుగురు వ్యాపారస్తులకు జరిమానాలు విధించారు.

ముగిసిన జాబ్‌మేళా

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో ఫాక్స్‌కాన్ కంపెనీకి చెందిన ప్రతినిధులు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 90 మంది ఉద్యోగాల కోసం జాబ్‌మేళాలో దరఖాస్తులు చేసుకున్నారు. 45 మందిని వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ఫాక్స్‌కాన్ కంపెనీ ఎస్‌కేఎస్ఎస్ జనరల్ మేనేజర్ కె.ఎస్.డి.మూర్తి తెలిపారు. ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమేష్‌కుమార్, అధ్యాపకులు కురుమయ్య, సోఫీ, మహదేవుడు, బాలరాజు, విష్ణు, బాలు, అనిత, మౌనిక ఉన్నారు.

పూర్తి విచారణ చేయాలి



కొల్లాపూర్: విద్యార్థి గనమోని కౌశిక్ మృతిపై పారదర్శకంగా విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర్గం శివవర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్‌ను కలిసి కౌశిక్ మృతిపై అనుమానాలు ఉన్నాయని వివరించారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. నాయకులు సలీం, శివకుమార్, రాజు, వెంకటస్వామి, సాయికిషోర్, బాలరాజు ఉన్నారు.